క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులకు హాజరైన సర్పంచులు, కార్యదర్శులు

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. పంచాయతీల పరిపాలన, నిధుల వినియోగం, 15వ ఆర్థిక సంఘం పనులు, పంచాయతీలో అభివృద్ధి ప్రణాళిక, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై సామర్లకోట శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శిక్షణ ఇచ్చారు. శిక్షణా తరగతుల్లో ఎంపీడీఓ వెంకటనారాయణ, ఈఓపీఆర్డీ భాస్కరరావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

సామర్లకోట: ప్రతి పంచాయతీ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్డీ శ్యామ్ సుందర్ అన్నారు. మండలంలోని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం ఆయన కొన్ని సూచనలు చేశారు. గ్రామాల్లో స్వాతంత్ర్య సమర యోధులు ఉంటే, వారిని సత్కరించాలన్నారు. వారి స్వాతంత్ర్య ఉద్యమంలో అనుభవాలను గ్రామ ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేయాలన్నారు. మూడు రోజుల పాటు పారిశుధ్యం, తాగునీటి సమస్య పరిష్కారం, ఎల్ఈడీ లైట్ల నిర్వహణపై శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు.

గొల్లప్రోలు ఎస్సైగా రామకృష్ణ



పిఠాపురం: గొల్లప్రోలు ఎస్సైగా నౌడు రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గండేపల్లి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన షేక్‌జాన్ బాషా బదిలీపై కాకినాడ పోర్టు స్టేషన్‌కు వెళ్లారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని నూతన ఎస్సైగా రామకృష్ణ తెలిపారు.

తహసీల్దార్‌గా చిన్నారావు బాధ్యతల స్వీకరణ



కొత్తపల్లిలో తహసీల్దార్ చిన్నారావుకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కొత్తపల్లి: మండల తహసీల్దార్‌గా జి.చిన్నారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయన ఏలూరు జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తపల్లి మండలానికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గొల్లప్రోలు తహసీల్దార్‌గా సత్యనారాయణ



పిఠాపురం: గొల్లప్రోలు మండల తహసీల్దార్‌గా ఎంవీవీ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కృష్ణా జిల్లా పామిడిముక్కలు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో గండేపల్లి, జగ్గంపేటతో పాటు కాకినాడ ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ఏఓగా పని చేశారు. నూతన తహసీల్దార్‌కు పలువురు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కబడ్డీ మీట్ విజేత నల్గొండ



విజేత జట్టుకు బహుమతి ఇస్తున్న ఆర్డీఓ

పెద్దాపురం: మూడు రోజులుగా స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహించిన రీజినల్ కబడ్డీ మీట్ బుధవారం సాయంత్రం అట్టహాసంగా ముగిసింది ఈ పోటీల్లో నల్గొండ జట్టు చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ఆర్డీఓ జే.సీతారామారావు విజేత జట్టుకు బహుమతులు అందజేశారు. విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమిచ్చి, అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

సామర్లకోట: దృష్టి ఐ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు డాక్టర్ ఎస్ మాధురి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు ఇచ్చారు. కంటి సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ రవిచంద్, ప్రిన్సిపాల్ వై లావణ్య, అధ్యాపకులు సేవలందించారు. మొత్తం 483 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్టు ఏఓ ఆకుల దుర్గాప్రసాద్ తెలిపారు.

స్వాతంత్ర్య పోరాటంలో సాహస ఘట్టం

- ఉద్యమ స్ఫూర్తి నింపిన పెద్దాపురం పురపాలక సంఘం ఘటన
- సత్యాగ్రహానికి మద్దతుగా ప్రప్రథమంగా జాతీయ జెండా రెపరెపలు

పెద్దాపురం: ఎందరో మహానుభావులు స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన త్యాగాలు, కృషి ఎనలేనివి. ఆ సమయంలో బ్రిటిష్ అధికారులను ఎదిరించి, సత్యాగ్రహానికి మద్దతుగా పురపాలక సంఘాలపై జాతీయ జెండాను ఎగురవేయడంలో పెద్దాపురం మున్సిపాలిటీ ప్రప్రథమ స్థానంలో నిలిచింది. సత్యాగ్రహానికి మద్దతు ఇవ్వవద్దని, ఎటువంటి కార్యక్రమాలు చేపట్టరాదని అప్పటి పెద్దాపురానికి చెందిన నాయకులు,, యువకులకు బ్రిటిష్ పోలీసులు ఆజ్ఞలు జారీ చేశారు. అయినప్పటికీ పెద్దాపురం నాయకులు ఉద్యమ స్ఫూర్తితో ఏ మాత్రం తగ్గకుండా, పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంపై ప్రప్రథమంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతేగాక దేవతా ఉత్సవం వద్ద మహాత్మా గాంధీ చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు. అప్పటి ఆంధ్రపత్రికలో ప్రచురించిన వార్త నేటికీ పదిలంగా, చారిత్రక సాక్ష్యంగా ఉంది. పురపాలక కార్యాలయ భవనాల్లో తొలుత పెద్దాపురం మున్సిపాలిటీలో జాతీయ జెండా రెపరెపలాడింది. అనంతరం అప్పటి బొంబాయి సత్యాగ్రహాన్ని బలపరుస్తూ, గుంటూరు, చీరాల, తెనాలి, నెల్లూరు, రామచంద్రపురం పురపాలక సంఘాల్లో స్వాతంత్ర్య యోధులు జాతీయ జెండాలు ఆవిష్కరించి తమ దేశభక్తిని చాటారు.



ప్రప్రథమంగా జాతీయ జెండా రెపరెపలాడిన అప్పటి పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం (ఫైల్)



2

ఆంధ్రదేశంలో స్వాతంత్ర్య దినోత్సవములు

పెద్దాపురములో పోలీసువారి జోక్యము

ఈ ఘటనపై అప్పటి ఆంధ్రపత్రిక క్లిప్పింగ్

స్వామిపై దేశభక్తి..



త్రివర్ణ పతాక అలంకరణలో వేణుగోపాల స్వామివారు

పిఠాపురం: దైవభక్తిలో దేశభక్తిని చాటుకున్నారు పిఠాపురం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు విజయజనార్దనాచార్యులు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయంలో స్వామివారిని వినూత్నంగా మూడు రంగుల పూలతో త్రివర్ణ శోభితుడిగా అలంకరించారు. స్వామిపై దేశ భక్తిని చాటుకోవడంతో ఆయనను పలువురు అభినందించారు.

పట్టణానికి త్రివర్ణ శోభ



సామర్లకోట సెంటర్ డివైడర్‌లో ఏర్పాటు చేసిన త్రివర్ణ లైటింగ్

సామర్లకోట: పట్టణానికి స్వాతంత్ర్య దినోత్సవ శోభ సంతరించుకుంది. సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో ఉన్న సెంటర్ డివైడర్‌లో రోడ్డు వెంబడి త్రివర్ణ రంగుల లైట్లను ఏర్పాటు చేశారు. జాతీయ పతాకాన్ని పోలి ఉండేలా మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు లైట్లు ఏర్పాటు చేయించారు. ఈ మేరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి ముఖ్య కూడలి ప్రదేశాల్లో త్రివర్ణ రంగులతో లైట్లను బుధవారం రాత్రి వెలిగించారు. మూడు రోజుల పాటు ఈ లైట్లను వెలిగిస్తామని కమిషనర్ తెలిపారు.

జైలుకెళ్లినా.. అలుపెరుగని

పెద్దాపురం యోధుడు

- స్వాతంత్ర్య ఉద్యమంలో కాండ్రకోటకు చెందిన పాక్కులూరి
- చెన్నపురి సత్యాగ్రహంలో కీలక పాత్ర



స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న కాండ్రకోట వాసి పాక్కులూరి సత్యనారాయణ (ఫైల్)


పెద్దాపురం: చెన్నపురి స్వాతంత్ర్యోద్యమంలో కాకినాడ జిల్లా పెద్దాపురం తాలుకాకు ఓ గుర్తింపు ఉంది. 1940 జూన్ 26న చెన్నపురి చైనా బజారు రోడ్డులో సత్యాగ్రహం చేస్తూ, యుద్ధ వ్యతిరేక నినాదాలు చేయడంతో కొందరిని అరెస్టు చేసి, ఫ్లవర్ బజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, తర్వాత కోర్టులో హాజరుపర్చారు. అందులో తొలి పోరాట యోధుడే పెద్దాపురం మండలం కాండ్రకోటకు చెందిన పాక్కులూరి సత్యనారాయణ. 1940 జూన్ 27న సత్యాగ్రహ ఉద్యమంలో ఆంధ్రాకు చెందిన ఏడుగురిని అరెస్టు చేయగా, మొదటి వ్యక్తి కాండ్రకోటకు చెందిన పాక్కులూరి సత్యనారాయణ (పెద్దాపురం తాలుకా). ఆయనతో పాటు సోమేశ్వరానికి చెందిన నాగదేవర వెంకట్రావు (రామచంద్రపురం తాలూకా), వానపల్లికి చెందిన బండారు వెంకట్రాజు (రాజోలు తాలూకా), వన్నె చింతలపూడికి చెందిన నడింపల్లి సీతారామరాజు (అమలాపురం తాలూకా), పాణింగపల్లికి చెందిన అయ్యల సోమయాజులు కామేశ్వరరావు (రామచంద్రపురం తాలూకా), బి.తాటిపర్తికి చెందిన నామా మార్కు (పిఠాపురం తాలూకా), గొల్లప్రోలుకు చెందిన ఈయుణ్ణి వీర రాఘవచార్యులు (పిఠాపురం తాలూకా) అప్పటి బ్రిటిష్ వారు పెట్టిన కేసులో అరెస్టు అయి, స్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర పోషించారు.

జైలు జీవితం.. సేవలు

యుద్ధానికి ప్రధాన సూత్రధారి అనే అభియోగంపై పాక్కులూరి సత్యనారాయణ 1941 జూన్ 28 నుంచి అక్టోబర్ 15 వరకు సుమారు నాలుగు నెలల 12 రోజుల పాటు బళ్లారి ఆరిపురం జైలులో శిక్ష అనుభవించారు. 1943 నుంచి 1946 వరకు తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాకినాడ కార్యాలయంలో పనిచేశారు. 1967 జూలై 14న లో విలేజ్ గైడ్ వర్కర్‌గా పదవీ విరమణ పొందారు. అప్పట్లో 35 రూపాయల రిటైర్మెంట్ పింఛనుతో కుటుంబాన్ని పోషించేవారు.

కాండ్రకోటలో కుటుంబం

ఆయన చిన్నాన్న పిల్లల కుటుంబం నేటికీ కాండ్రకోట గ్రామంలో నివసిస్తున్నారు. 1912 ఆగస్టు 15న జన్మించిన పాక్కులూరి సత్యనారాయణ 2004 ఏప్రిల్ ఆరున హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఏడుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమారులకు, ఓ అమ్మాయికి వివాహం కాగా, మిగిలిన వారికి నేటికీ అవివాహితులుగానే ఉన్నారు. వారు హైదరాబాద్‌లో ఉంటున్నట్టు, ఇక్కడ ఆయన మునిమనవడు పాక్కులూరి శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. తమ తాతగారు స్వాతంత్రోద్యమంలో పాల్గొనడం తమకు గర్వంగా ఉందని చెప్పారు. కుటుంబ సభ్యులందరూ ఆగస్టు 15న ఏటా ఆ మహనీయునికి నివాళులర్పిస్తామన్నారు.



7 గురు ఆంధ్ర సత్యాగ్రహులఅరెస్టు

చెన్నపురిలో సత్యాగ్రహము

అప్పటి పత్రికల్లో సత్యనారాయణ అరెస్టుపై వచ్చిన వార్త

యువతపై ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి



ముగింపు సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: సమాజాభివృద్ధిలో కీలక భాగస్వాములైన యువతను క్రమపద్ధతిలో పెట్టాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ఎంపీడీఓ ఎం.ఉషారాణి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే సర్పంచ్‌ల శిక్షణా తరగతుల ముగింపు సభ బుధవారం ఈఓపీఆర్డీ బీవీ రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమైందన్నారు. సర్పంచ్‌లు అంకితభావంతో పని చేస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చెయ్యవచ్చన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్ల నిర్వహణ, పంచాయతీ పాలన తీరు, తదితర అంశాలపై శిక్షణ పొందిన సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గుడివాడ, కాండ్రకోట, కొండపల్లి, పులిమేరు, చదలాడ, కట్టమూరు, ఆర్‌బీపట్నం తదితర గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జాతీయ జెండా అందజేత



ఎమ్మెల్యే రాజప్పకు జాతీయ జెండాను అందజేస్తున్న పోస్ట్‌మాస్టర్లు

సామర్లకోట: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు పలువురు పోస్ట్‌మాస్టర్లు బుధవారం జాతీయ జెండాను అందజేశారు. కొన్నేళ్లుగా తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాల విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి జాతీయ జెండాను వారు అందజేశారు. కార్యక్రమంలో పెద్దాపురం పోస్ట్‌మాస్టర్ లెక్కల నాయుడు, కాండ్రకోట బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఎ.సురేంద్రనాథ్, సామర్లకోట బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ చెవ్వాకుల ఈశ్వరరావు, గుడివాడ పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు జాతీయ జెండాలను అందజేస్తున్నట్టు వారు తెలిపారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

సామర్లకోట: స్థానిక బసివిరెడ్డి సత్రం వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే చినరాజప్ప బుధవారం సాయంత్రం పరిశీలించారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు.

బాధిత కుటుంబాలకు వంగా గీత పరామర్శ



అమరవల్లిలో సతీష్ రెడ్డిని పరామర్శిస్తున్న గీత

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను బుధవారం కాకినాడ మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వంగా గీత పరామర్శించారు. అమరవల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గొరిసే సతీష్ రెడ్డిని, ఉప్పాడకు చెందిన చోడిపల్లి అప్పారావు, జగన్నాథం, వీవర్స్ కాలనీకి చెందిన ఇనుమర్తి వీరభద్రంతో పాటు పలు కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, ఉమ్మిడి జాను, కారే శ్రీనివాస్, మెరుగు ఎల్లాజీ, గొరిసె కాపురెడ్డి, బొందు రాంబాబు, గింజల శ్రీనివాస్, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, ఇనుమర్తి భగవాన్, కొండమూరి కామేశ్వరరావు, ఉమ్మిడి శ్యామ్ తదితరులు ఉన్నారు.

300 అడుగుల త్రివర్ణ పతాకం



భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

సామర్లకోట: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఆధ్వర్యంలో బుధవారం 300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఈ ర్యాలీని కౌన్సిలర్ బలుసు వాసు ప్రారంభించారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించినట్టు హెచ్ఎం తెలిపారు. అయోధ్య రామపురంలోని హైస్కూల్ నుంచి మఠంసెంటర్, స్టేషన్ సెంటర్, బస్సు కాంప్లెక్స్, కొత్తూరు మీదుగా ర్యాలీ హైస్కూల్‌కు చేరింది. కౌన్సిలర్ పితాని కృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, ఉపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ, జి.గోవిందు, ఏఎల్‌వీ కుమారి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, వల్లూరి గాంధీ, పడాల పుత్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఏడీఏ ధైవకుమార్



కట్టమూరు పొలంబడిలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ, ఏఓ

పెద్దాపురం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని పెద్దాపురం వ్యవసాయ శాఖ ఏడీ ఎస్.ధైవకుమార్ అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో బుధవారం ఏఓ సంజయ్‌కుమార్ అధ్యక్షతన పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ధైవకుమార్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి సేద్యంలో నీమాస్త్రాన్ని స్వయంగా తయారు చేసుకోవచ్చన్నారు. ఈ నీమాస్త్రం మూడు నెలల వరకు నిల్వ ఉంటుందని, తయారైన ఎరువును పంటపై చల్లుకోవాలన్నారు. రెండు, మూడు సార్లు ఎకరానికి 200 లీటర్ల నీమాస్త్రాన్ని తయారు చేసి, పంట విత్తిన 20, 45, 60 రోజులకు చల్లాలన్నారు. రైతులు తప్పనిసరిగా వరిలో పిచికారీ చేయాలన్నారు. ఏఓ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ నీమాస్త్రం ఎరువు అన్ని రకాల పురుగు గుడ్లను చంపడమే కాకుండా, పంట తెగుళ్ల నివారణకు పని చేస్తుందన్నారు. అనంతరం నీమాస్త్రం ఎరువు తయారీని రైతులకు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రసాద్, వీఏఏలు విజయదుర్గ, అమృత, రైతులు రామకృష్ణ, సుబ్బారావు, గోవిందు, పాపారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో వర్గపోరు

- సన్మాన కార్యక్రమ ఫ్లెక్సీలో ఒకే నేత ఫొటో
- వెనుదిరిగిపోయిన పార్టీ శ్రేణులు
- నిలిచిపోయిన సన్మాన కార్యక్రమం



ఉప్పాడలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



నాయకులు వెళ్లి పోవడంతో వెలవెలబోతున్న వేదిక

కొత్తపల్లి: మండలంలోని జనసేన పార్టీలో వర్గపోరు మొదలైంది. పార్టీ కోసం కష్టపడిన వారిని, పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న నాయకులను పక్కనబెట్టి తానొక్కడే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఒక నేత ఫ్లెక్సీలో తన ఫొటో మాత్రమే వేసుకోవడంతో అక్కడకు వచ్చిన నాయకులు కంగు తిన్నారు. మండలంలోని ఉప్పాడ సెంటర్‌లో బుధవారం సాయంత్రం జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదులో 500 సభ్యత్వాలు చేసిన వారికి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన ఫెక్సీలో గంటా విజయ్‌కుమార్ తన ఫొటోను మాత్రమే వేసుకోవడంతో కార్యక్రమానికి వచ్చిన ముఖ్య జనసేన పార్టీ నాయకులు వెనుదిరిగారు. మండలంలో ముఖ్య నాయకులు ఉండగా వారెవ్వరి ఫొటో వేయకపోవడంపై నాయకులు అసహనానికి గురయ్యారు. నాయకులెవ్వరూ లేకపోవడంతో సన్మాన కార్యక్రమం నిలిచిపోయింది. ఒక వర్గానికి చెందిన వ్యక్తులకే సమాచారం ఇచ్చారని కొందరు జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి వెళతామని తెలిపారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



రామన్నపాలెంలో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న మత్స్యకార మహిళలు

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో రామన్నపాలెం ఉప్పుటేరులో మత్స్యకారులు బోటుపై జాతీయ జెండాలను ప్రదర్శించారు. మత్స్యకార మహిళలు జెండాలతో ర్యాలీలు చేశారు.

దివిలి జంక్షన్.. తప్పని టెన్షన్

- నిరంతర ట్రాఫిక్‌తో ప్రజల కష్టాలు
- కలగా మిగిలిన విస్తరణ పనులు
- నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ జాం



రాత్రి వేళ వాహనాలతో రద్దీగా ఉన్న దివిలి జంక్షన్

పెద్దాపురం: నిత్యం రద్దీగా ఉండే సామర్లకోట-ప్రత్తిపాడు రహదారిలోని దివిలి జంక్షన్ ప్రమాదకరంగా మారింది. వాహన చోదకులు నిత్యం భయాందోళనతో ప్రయాణాలు సాగిస్తున్నారు. పెద్దాపురం మండలంలోని దివిలి-చంద్రమాంపల్లి ప్రధాన రహదారి నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటోంది. ఉదయం పాఠశాల, కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు, ఉద్యోగులు, మెట్ట ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారుల వాహనాలు ఇదే జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంది. ఏళ్ల తరబడి ఉన్న ట్రాఫిక్ సమస్యను మాత్రం పట్టించుకునే నాథుడే లేడు. రహదారి విస్తరణకు గత ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా పనులు చేపడతామని హామీ ఇచ్చినా, అది కార్యరూపం దాల్చలేదు. అటు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాక, ఇటు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విస్తరణకు మార్జిన్ ఇచ్చినా..

రోడ్డు విస్తరణ పనులకు ఆయా దుకాణాల తొలగింపు కోసం మార్జిన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో ఇది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. సంబరపడిన రెండు రోజులకే అభివృద్ధి పనులు ఆగిపోవడంతో ప్రజలు అవాక్కయ్యారు. అసలు కన్నా కొసరు మిన్న అన్నట్టుగా తయారైంది చంద్రమాంపల్లి వ్యాపారుల దుస్థితి. రోడ్డు విస్తరణ పనుల్లో అవసరమైన మార్జిన్ మేరకు దుకాణాలు తొలగించకున్నా, ఆయా దుకాణాల ఎదురుగా అద్దెలకు వేరే దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇటీవల ఆయా ఆక్రమణలను ఎత్తివేసేందుకు పోలీసులకు గత ఆర్డీవో ఆదేశాలు ఇచ్చారు. అయినా ఆచరణ కాకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది.


హామీలే.. ఆచరణ శూన్యం



దివిలి ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపడతామని 2019లో అప్పటి మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దుకాణదారులను వెనక్కి జరిగేలా పోలీస్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నెల తిరక్కుండానే రోడ్లుపైకి మళ్లీ దుకాణాలు చేరాయి. రెండున్నరేళ్ల నుంచి కాలయాపన చేస్తున్నారు మినహా, అభివృద్ధి చర్యలు చేపట్టక, నిత్యం ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

– వట్టికూటి రాజ్‌కుమార్, నిరుద్యోగి, దివిలి, పెద్దాపురం మండలం

సిబ్బందిని నియమిస్తాం



మండలంలోని దివిలి జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమిస్తాం. ప్రతి రోజూ ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేసి, ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. విస్తరణ పనులకు మిగిలిన శాఖల అధికారులు ముందుకు వస్తే, ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

– వి.మౌనిక, ఎస్సై, పెద్దాపురం